సాక్షి
కాకినాడ
శుక్రవారం | 22 | డిసెంబర్ | 2023



108 బంగారు పుష్పాల సమర్పణ


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి వేగుళ్ల వీర వెంకట సత్యనారాయణ చౌదరి దంపతులు 80 గ్రాముల బరువైన 108 బంగారు పుష్పాలు సమర్పించారు.



రూ.3 లక్షల విరాళం

తొండంగి: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి సలాది సత్యనారాయణమూర్తి (పిఠాపురం) గురువారం రూ.3 లక్షల విరాళం అందజేశారు.

డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

సుబ్రహ్మణ్యేశ్వరుని హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కింపులో పాల్గొన్న భక్తులు, అర్చకులు

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలోని మందేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు ముగియడంతో ఆలయ ఈఓ జోగా సత్యనారాయణ, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఎండోమెంట్స్ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టరు ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 15 రోజులకు రూ.2,33,762 ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు.

నన్నయ వర్సిటీ హాకీ జట్టు ఎంపిక



సౌత్ జోన్ హాకీ పోటీలకు ఎంపికైన నన్నయ వర్సిటీ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ హాకీ జట్టు ఎంపికను జిల్లా క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల నుంచి క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారు. వర్సిటీ పరిశీలకుడిగా డీఆర్‌కే రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివన్నారాయణ రెడ్డి, కమిటీ సభ్యులుగా హాకీ కోచ్ రవిరాజు, నాగేంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, యూనివర్సిటీ పీడీ డాక్టర్ రామ్‌గోపాల్ మాట్లాడుతూ యూనివర్సిటీ జట్టుకు 18 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరు ఈ నెల 24 నుంచి 30 వరకూ తిరుచిరాపల్లిలోని చెన్నై భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

శ్రీరాముని పూజాక్షతలతో శోభాయాత్ర

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరామ పూజాక్షతలను వచ్చే నెల 1 నుంచి ఐదో తేదీ వరకూ గ్రామ స్థాయిలో పంపిణీ చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ తెలిపారు. స్థానిక వెంకట్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విజయ మహామంత్ర శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్, వివిధ క్షేత్రాల సంయుక్త ఆధ్వర్యంలో అక్షతలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు గళ్లా సుబ్బారావు, శ్రీకృష్ణవాణి, గరిమెళ్ల అన్నపూర్ణయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సర్... వన్స్‌మోర్



- ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- జిల్లావ్యాప్తంగా కేకులు కట్ చేసి సంబరాలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో 100 కేజీల కేక్ కట్ చేస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గురువారం అత్యంత వేడుకగా నిర్వహించారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆయన మరోసారి అధికారంలోకి రావాలని మనసారా ఆకాంక్షిస్తూ.. అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 'సీఎం సార్.. వన్స్‌మోర్' అంటూ నినదించారు. ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యాన్ని ఆయనకు కలిగించాలని కోరుతూ వివిధ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ నేతల ఆధ్వర్యాన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యాన వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద మసీదు వద్ద పేద మహిళలకు కుట్టు మెషీన్లు, దివ్యాంగులకు వీల్ చైర్లు, మసీదులకు ఫైర్ సేఫ్టీ పరికరాలు పంపిణీ చేశారు. జగన్నాథపురం ప్రాంతంలో సుమారు 180 మందికి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. పాత్రికేయుల పాతికేళ్ల కోరికగా ఉన్న ప్రెస్‌క్లబ్ భవనాన్ని సమకూర్చి ప్రారంభించారు. ముఖ్యంగా సంజయ్ నగర్ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ కార్యాలయాన్ని అత్యంత ఆడంబరంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మరోసారి గెలిపించేలా ప్రతి కార్యకర్తా ఇప్పటి నుంచే కష్టించి పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు పాల్గొన్నారు.
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యాన పిఠాపురం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి, నాయకులకు, కార్యకర్తలకు పంచారు. ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానికంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆర్థిక సహాయంతో 2 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించి, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ, సీఎం జగన్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజలకు మళ్లీమళ్లీ ప్రజలకు సేవలందించాలని, మరోసారి అధికారం చేపట్టాలని ఆకాంక్షించారు.
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యాన సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. శంఖవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్వత మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి అహర్నిశలూ పాటు పడుతున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యాన జగ్గంపేటలో సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ, ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా సీఎం జగన్ మరోసారి అధికారం దక్కించుకోవడం తథ్యమని అన్నారు.
- పెద్దాపురంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యాన ఆయన క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దవులూరి దొరబాబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతూ, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా ఉండేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి అధికారాన్ని చేపట్టడం తథ్యమని చెప్పారు.
- తునిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, రాష్ట్ర పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని ఆధ్వర్యాన సీఎం పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తుని శ్రీరామ థియేటర్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే కోటనందూరు, తుని రూరల్, తొండంగి మండలాల్లో సీఎం జగన్ బర్త్‌డే వేడుకలను నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.

సీఎం జగన్ ప్రజల ఆస్తి

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆస్తి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేటలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 100 కేజీల బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ, సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో ఎటువంటి వివక్షా చూపకుండా ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారని అన్నారు. 'నేనున్నాను.. నేను విన్నాను' అనే మాటలను అక్షర సత్యం చేశారన్నారు. యువగళం సభలో చంద్రబాబు, లోకేష్, వారికి మద్దతు పలుకుతున్న నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని, ప్రభుత్వాన్ని చాలా దుర్మార్గంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. పెత్తందార్లు, కార్పొరేట్ శక్తులు, తన చుట్టూ ఉన్నవారి కోసమే చంద్రబాబు పని చేశారని, పేదల కోసం, ప్రజల కోసం ఆలోచించని చంద్రబాబును ప్రజలు 23 స్థానాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఈ వేళ మళ్లీ తాను మారిన మనిషినని, మేకతోలు కప్పుకున్న మనిషినని అంటూ సీఎం జగన్ హామీలను కాపీ కొట్టి, కొత్త హామీల పేరుతో మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నారని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ప్రతి ఒక్కరి కష్టాన్ని తెలుసుకుని మరీ పథకాలు అందించారని చెప్పారు. నాలుగేళ్ల కాలంలో 16 వైద్య కళాశాలలు కడతారని ఎవ్వరూ ఊహించలేదన్నారు. నాడు – నేడు కింద 42 వేల పాఠశాలలను ఆధునీకరించారన్నారు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డిని దీర్ఘాయుష్మాన్ భవ అని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని కన్నబాబు అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దివ్యాంగులకు వినికిడి పరికరాలను, కరప మండలానికి చెందిన దివ్యాంగురాలు శేషవేణికి మూడు చక్రాల స్కూటీ, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 13 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రమణయ్యపేట ఆశ్రమ శ్రావణి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే ఈసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై రేపు ముక్కోటి ఏకాదశి వేడుకలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా అలంకరించి, ప్రధానాలయంలో ఉత్తరాభిముఖంగా ఆశీనులను చేస్తారు. తెల్లవారుజామున 4 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వెండి రథంపై స్వామివారి ప్రాకార సేవ నిర్వహిస్తారు. భక్తులకు కదంబం ప్రసాదం పంపిణీ చేస్తారు. రాత్రి 7 గంటల నుంచి అన్నవరం గ్రామ వీధుల్లో స్వామి, అమ్మవార్లకు వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలతో, పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. స్వామివారి ఆలయం దిగువ నుంచి ఉత్తర ద్వార దర్శనానికి క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నత భవితకే ట్యాబ్‌లు

- జేసీ ఇలక్కియ
- సాలిపేట పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ పద్మశ్రీ తదితరులు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జేసీ ఇలక్కియ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ సిటీ: విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు అందించే రెండో విడత కార్యక్రమాన్ని స్థానిక సాలిపేట మున్సిపల్ కార్పొరేషన్ బాలికల పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. జేసీ ఇలక్కియ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న ముఖ్య అతిథులుగా పాల్గొని, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రెండో దశలో జిల్లా వ్యాప్తంగా తొలి విడతగా ఎనిమిదో తరగతి చదువుతున్న 2,016 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. వీటిని 12వ తరగతి వరకూ ఉపయోగపడేలా బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. బాలబాలికలు విద్యను కొనసాగించేలా వారి యూనిఫాం దగ్గర నుంచి అన్ని విషయాలనూ స్వయంగా పరిశీలించి, అత్యంత నాణ్యతతో కూడినవే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇష్టమైన రంగాల్లో రాణించి, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జేసీ ఇలక్కియ కోరారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, విద్య, వైద్యం, గృహకల్పనపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. విద్యా రంగంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల కారణంగా తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారం తగ్గిందని అన్నారు. సాధారణ తరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు కొనివ్వలేని ట్యాబ్‌లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. బైజూస్ కంటెంట్‌తో కలిపి వీటి విలువ రూ.32 వేలని తెలిపారు. మన బడి నాడు – నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో జగనన్న అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా దుమ్ములపేట, రాజీవ్ గృహకల్ప, పర్లోవపేటకు చెందిన తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు సుమారు 500 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలకు 33 వేల ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటికే 10 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే ద్వారంపూడి తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని జేసీ ఇలక్కియ, ఎమ్మెల్యే ద్వారంపూడి కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కూడా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ, డీఈఓ జి.నాగమణి, డిప్యూటీ డీఈఓ డానియేల్ రాజు, డి.సుభద్ర, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాధికార బస్సు యాత్రకు సర్వం సిద్ధం

- నేడు మండపేటలో నిర్వహణ
- బైక్ ర్యాలీ, బహిరంగ సభకు పూర్తయిన ఏర్పాట్లు



మండపేటలో ఏర్పాట్లుపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: దళిత, బడుగు బలహీన వర్గాలను గత పాలకులు కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. ఎన్నికలప్పుడు పొగడ్తలు, ఎన్నికలయ్యాక పట్టించుకోకపోవడమనే వైఖరితో వ్యవహరించారు. ఇటువంటి వైఖరితో విసిగి వేసారిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగుదివ్వెలా నిలిచారు. తన పాలనలో సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు తన ఆత్మీయులంటూ పదే పదే చెప్పడమే కాదు.. పాలనలోనూ ఆ ప్రేమానురాగాలు చూపిస్తున్నారు. మంత్రి వర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సామాజిక న్యాయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సీఎం జగన్ పాలనలో చేకూరిన అభ్యున్నతిని వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం మండపేటలో జరగనుంది. దీనికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సభా స్థలం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. గత నెల 16న కొత్తపేటలో తొలి బస్సు యాత్ర జరగగా.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇది రెండోది.

నీలి ఆకాశం నేలకు దిగినట్టు..

నీలి ఆకాశం నేలకు దిగిందా అన్నట్టు.. బస్సు యాత్ర నేపథ్యంలో నీలం, ఆకుపచ్చ రంగులతో కూడిన వైఎస్సార్ సీపీ జెండాలతో మండపేట పట్టణంలోని వీధులు సరికొత్త కళను సంతరించుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు అభినందనలు తెలుపుతూ పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బస్సు యాత్రగా వస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలకు సాదర స్వాగతం పలుకుతున్నారు.

పట్టణం వైపు కదులుతున్న పల్లెలు

సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన వైఎస్సార్ సీపీ పట్ల అభిమానాన్ని చాటుకునేందుకు నియోజకవర్గంలోని పల్లెవాసులు మండపేట పట్టణం దిశగా కదులుతున్నారు. పట్టణంతో పాటు రూరల్ మండలం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. బుధ, గురువారాల్లో గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించుకుని తగిన ప్రణాళిక రూపొందించుకున్నారు.

యాత్ర సాగుతుందిలా..

సామాజిక సాధికార బస్సు యాత్రలో మంత్రులు పినిపే విశ్వరూప్, జోగి రమేష్, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, ఎంపీలు చింతా అనురాధ, పిల్లి సుభాష్‌చంద్రబోస్, నందిగం సురేష్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పండుల రవీంద్రబాబు పాల్గొంటున్నారు. వీరందరూ మధ్యాహ్నం 2 గంటలకు తాపేశ్వరం అతిథి ఫంక్షన్ హాలులో విలేకర్ల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని పెద్దకాలువ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో యాత్ర ప్రారంభిస్తారు. ఈ యాత్ర పట్టణ ప్రధాన రహదారి మీదుగా సాయంత్రం 4 గంటలకు కలువపువ్వు సెంటర్‌కు చేరుతుంది. అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. కాకినాడ నుంచి రావులపాలెం వైపు వెళ్లే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లిస్తారు. రాయవరం, మండపేట రూరల్ మండలాల నుంచి యాత్రలో పాల్గొనేందుకు వచ్చే వారిని పూలే విగ్రహం వద్ద దించుతారు. అనంతరం వాహనాలను మండపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపాన నిలుపుతారు. కపిలేశ్వరపురం మండలం నుంచి వాహనాల్లో వచ్చే వారిని రాజారత్న సెంటర్‌లో దించుతారు. ఆ వాహనాలు గుమ్మిలేరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలోని లే అవుట్ వద్ద నిలుపుతారు.

సామాజిక సాధికారతకు ప్రతీక



పేద, బడుగు బలహీన వర్గాల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా రూ.2.38 లక్షల కోట్ల మేర లబ్ధిని జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. మండపేటలో నిర్వహించే బస్సు యాత్ర ప్రభుత్వం పారదర్శకతతో అందిస్తున్న సామాజిక సాధికారతకు ప్రతీకగా నిలుస్తుంది. నియోజకవర్గ ప్రజలు నన్ను, పార్టీని ప్రేమగా ఆదరిస్తున్నారు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, మండపేట

ఓటుపై మహిళా చైతన్యం

- ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- పాల్గొన్న జేసీ ఇలక్కియ, ఈఆర్వో, డీఆర్వో, అధికారులు



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: రంగవల్లులతో మహిళలు 'ఓటు' విలువను తెలియజెప్పారు. అందమైన ముగ్గులను వేసి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్‌లో భాగంగా (స్వీప్) ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు ఆధ్వర్యంలో స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు 180 మందికి పైగా పోటీల్లో పాల్గొని ఓటు ఆవశ్యకతను వివరిస్తూ రంగవల్లులు తీర్చిదిద్దారు.

పాల్గొన్న జేసీ, ఈఆర్వో, అధికారులు

రంగవల్లుల పోటీలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద పరిశీలించారు. న్యాయనిర్ణేతల సమక్షంలో ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి పట్నాల ఈశ్వరి, పాలెపు మణిగీతిక, చోడిపల్లి స్వర్ణలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. వీరితోపాటు మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ ఇలక్కియా

క్లుప్తంగా

25 మంది బాలలకు క్లబ్ ఫుట్ స్క్రీనింగ్ పరీక్షలు



చిన్నారి కాలిని పరీక్షించి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి వివరిస్తున్న హెచ్ఓడీ డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: క్లబ్ ఫుట్ (వంకర పాదాలు)తో జన్మించి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న బాలల జీవితాలలో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ (సీఐఐటీ) వెలుగులు నింపింది. అటువంటి 25 మంది బాలలను గుర్తించి జీజీహెచ్‌లో క్లబ్ ఫుట్ చికిత్స చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం 25 మంది బాలలకు స్క్రీనింగ్ (గుర్తింపు) పరీక్షలు జరిగాయి. ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ప్రారంభించారు. మొత్తం 25 మంది ఈ పరీక్షలకు హాజరు కాగా, 10 మందికి ఇంటి వద్దే ఉంచి కట్లు వైద్యం ద్వారా కాళ్ల వంకర్లు సరిచేయాలని నిర్ణయించారు. మరో నలుగురు బాలలకు శస్త్రచికిత్సలు అవసరం అని గుర్తించి వారిని తక్షణమే వార్డుల్లో చేర్చారు. 11 మంది బాలలను ఇళ్లకు పంపి వైద్య నిపుణులు, స్థానిక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచి కుటుంబసభ్యుల అనుమతి అనంతరం చికిత్స ప్రారంభించనున్నారు. క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ సంస్థ డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డైస్) కాకినాడ బృందం సమన్వయంతో ఈ పరీక్షలు నిర్వహించింది. జీజీహెచ్ డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.అనిత, ఆర్ఎంవో డాక్టర్ పి.రాహుల్, ఫిజియోథెరపీ వైద్యులతో పాటు ఆర్థోపెడిక్ ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, ఇతర వైద్య బృందం పాల్గొన్నారు.

సిరులు వెదజల్లు



సందిపూడిలో వెదజల్లు సాగు చేపట్టిన పొలంలో విత్తనాలు చల్లుతున్న రైతులు

- ఈ సాగుపైనే అన్నదాతల ఆసక్తి
- పెట్టుబడి ఆదాతో పాటు అధిక దిగుబడి
- డ్రమ్ సీడర్ పద్ధతితో మరింత మేలు

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనుసరిస్తున్న పారదర్శక విధానాలతో వ్యవసాయ రంగం లాభసాటిగా సాగుతోంది. అధునాతన, పురాతన పద్ధతులను మేళవించి వ్యవసాయం చేపట్టడం ద్వారా రైతులు పెట్టుబడిని నియంత్రించుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో పాటు సరైన గిట్టుబాటు ధర లభించడంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో రబీ సాగుకు సమాయత్తమవుతున్నారు. పెరిగిన ఎరువుల ధరలు, కూలీల కొరత వల్ల పెట్టుబడిని తగ్గించుకునేందుకు ఈసారి అధికంగా రైతులు వినూత్నమైన రీతిలో వెదజల్లు సాగు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 1,58,281 ఎకరాల్లో 96,572 మంది రైతులు వరి సాగు చేపట్టారు. ఈ సీజన్‌లో సుమారు 80 శాతం మేర వెదజల్లు సాగునే ఎంచుకోగా మిగిలిన రైతులు వరినాట్లు పద్ధతిని అవలంబిస్తున్నారు. సాగునీటి ఎద్దడి దృష్ట్యా వ్యవసాయశాఖ ఈ నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలని సూచించడంతో రైతులు తమ పనులను వేగవంతం చేశారు. సాధారణంగా రబీలో జిల్లా వాసులు వరిలో ముతక రకాలైన బొండాలు ఎక్కువగా సాగు చేయడం పరిపాటిగా మారింది. గత ఏడాది ఎంటీయూ 3626 (బొండాలు) ధర ఆశించినంతగా లభించినా ఒకేసారి తగ్గిపోవడంతో ఈ సీజన్‌లో తక్కువ సమయానికి కోతకు వచ్చే కొత్త రకమైన ఎంటీయూ 1121 సన్నాలను రైతులు సాగు చేస్తున్నారు. వీటికి తెగుళ్లను తట్టుకుని ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతుల అభిప్రాయం. వ్యవసాయ శాఖ అధికారులు కూడా వెదజల్లు సాగు వల్ల కలిగే లాభాలను వివరించడంతో రైతులు కూడా ఈవిధానాన్నే పాటించేందుకు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది విత్తనాలు రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉండటంతో సమయానికి ముందే రైతులు రబీ సాగు చేపట్టగా అందులో అధిక భాగం వెదజల్లు సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

కలుపు యాజమాన్య పద్ధతి

రబీపంట తొలిదశలో నీరు నిలగట్టక ఆరుతడిగా సాగు చేయడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉంటుంది. అందు వల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలి. ఒక ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా ప్రెటిలాక్లోర్ మందును ఎకరాకు 400 మి.లీ లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రాముల మందును 20 కిలోల పొడి ఇసుకలో కలపాలి. ఈ మందును వెదజల్లు విధానంలో విత్తిన 3–5 రోజుల్లో పొలంలో పలుచగా నీరు పెట్టి కలుపు మందును పిచికారీ చేయాలి. ఆ తరువాత పొలంలో నీరు తీసి వేయడం ద్వారా కలుపును నివారించవచ్చు. రెండో దశ నుంచి పొలంలో ఏర్పడిన కలుపును మొక్కల మధ్య తొక్కడం ద్వారా ఎరువుగా మలచుకోవచ్చు.

నీటి యాజమాన్య పద్ధతి

విత్తనం వేసినప్పటి నుంచి పొట్ట దశ వచ్చే వరకూ పొలంలో నీరు నిల్వ ఉండకుండా కేవలం బురదగా మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కువైన నీటిని బయటకు పోవడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల వరి కంకి వేర్లు ఆరోగ్యవంతంగా పెరిగి ఎక్కువ పిలకలు పెట్టే అవకాశం ఉంటుంది. పైరు పొట్ట దశ నుంచి పంట కోసే పది రోజుల ముందు రెండు సెంటీ మీటర్ల నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.

డ్రమ్ సీడర్ పద్ధతిలో..

దమ్ము చేసిన అనంతరం చదును చేసిన భూమిలో పలచటి నీటి పొర ఉండేలా చూసుకుని మడి కట్టిన విత్తనాన్ని చల్లాలి. డ్రమ్ సీడర్ పరికరానికి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములు ఉంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెంటీ మీటర్ల దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూతను బిగించాలి. గింజలు నింపిన డ్రమ్ సీడర్‌ను లాగితే ఎనిమిది వరుసల్లో 20 సెంటీ మీటర్ల దూరంలో గింజలు పడతాయి. దీంతో వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5 నుంచి 8 సెంటీ మీటర్ల దూరం ఉంటుంది. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పులో కాలిబాటలు వేసుకోవాలి. తాడు లాగి డ్రమ్ వాడితే వరుసలు బాగా వచ్చి విత్తు సక్రమంగా జరుగుతుంది.

వెదజల్లు సాగుతో ఉపయోగాలు

- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి కూలీల కొరతను అధిగమించవచ్చు.
- సాగునీటి ఎద్దడిని అధిగమిస్తుంది. పంట పది రోజుల ముందే కోతకు వస్తుంది. భూమి సారవంతంగా మారుతుంది.
- మొక్కలో సాంద్రత పెరిగి పది శాతం మేర అధిక దిగుబడికి అవకాశం ఏర్పడుతుంది.
- సాధారణ పద్ధతిలో వరిసాగు చేయాలంటే ఎకరం పొలంలో వరిసాగుకు వరి నారుమడికి 30 కేజీల విత్తనాలు అవసరమవుతాయి.
- అదే వెదజల్లు పద్ధతిలో కేవలం 12 నుంచి 18 కేజీల వరి విత్తనాలు మాత్రమే అవసరమవుతాయి.
- కలుపు మొక్కలను సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఎరువుగా మలచుకోవచ్చు.
- నారుమడులు పోసి ఊడ్చేందుకు పట్టే ఎక్కువ సమయాన్ని వెదసాగుతో అరికట్టవచ్చు.
- దీనివల్ల పెట్టుబడి సుమారు రూ.మూడు వేల వరకూ ఆదా అవుతుంది.
- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా నీరు అందుబాటులో ఉన్నప్పుడే వరిసాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

వాటిని జాతీయ రహదారులుగా మార్చండి

ప్రధాని మోదీకి ఎంపీ గీత విజ్ఞప్తి



ప్రధానమంత్రి నరేంద్రమోదీని మర్యాద పూర్వకంగా కలిసిన ఎంపీ గీత

కాకినాడ సిటీ: జిల్లాలోని ముఖ్యమైన మూడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ఆదేశాలు ఇవ్వాలని ఎంపీ వంగా గీత ప్రధాని నరేంద్రమోదీని కోరారు. గురువారం ఆమె ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు ఎంపీ గీత వివరించారు. కాకినాడ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వయా రామచంద్రపురం మీదుగా, కాకినాడ నుంచి జొన్నాడ వయా రామచంద్రపురం మీదుగా, కాకినాడ నుంచి తూర్పుగోదావరి జిల్లా వయా సామర్లకోట కెనాల్ రోడ్లు ఈ మూడు రహదారులు అత్యంత ముఖ్యమైన పుణ్యక్షేత్రాలైన పంచారామ క్షేత్రం, అష్టాదశ శక్తి పీఠం, గయా క్షేత్రం, దత్త క్షేత్రాలను కలుపుతూ వర్తక, వాణిజ్యపరంగా మూడు జిల్లాలను కలుపుతున్న ప్రధాన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కోరారు. గతంలో కేంద్ర రాష్ట్ర రహదారుల శాఖామాత్యులు నితిన్ గట్కారికి ప్రతిపాదనలు సమర్పించినట్టు ఆమె తెలిపారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి స్పందించి కేంద్ర రాష్ట్ర రహదారుల శాఖ అధికారులకు ప్రతిపాదనలకు సంబంధించి నివేదిక తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీ గీత వివరించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలసి రాష్ట్ర రహదారులు మూడు జాతీయ రహదారులుగా మార్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు ఎంపీ వంగా గీత వివరించారు.

24న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 10 కిలోమీటర్ల పురుషులు, మహిళలు, 8 కిలో మీటర్ల అండర్–20 బాలురు, బాలికలు, అండర్–20 బాలికలకు 6 కిలోమీటర్లు, అండర్–18 బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్ల, అండర్–16 బాలురు, బాలికలకు 2 కిలోమీటర్ల పరుగు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు శనివారంలోపు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో సంఘ కోశాధికారి వర్మకు రిపోర్టు చేయాలని కోరారు.

పేదలకు వరం జగనన్న పాలన

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



జెడ్పీ కార్యాలయంలో సీఎం జగన్ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేస్తున్న చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు సంక్షేమ పథకాలను పేదల చెంతకు చేర్చిన మహోన్నత వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గురువారం జెడ్పీ సమావేశపు మందిరంలో జెడ్పీ ఉద్యోగులతో కలిసి ఏర్పాటు చేసిన సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించడంలో జగన్ కృషి అభినందనీయమన్నారు. గతంలో అర్హత ఉన్నా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి ఉండేదని, నాయకుల సిఫార్సులు ఉంటేనే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉండేదన్నారు. జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలకు చరమగీతం పాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల చెంతకు చేర్చిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ సీఎం అవుతారని ఆయన జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను వేణుగోపాలరావు జెడ్పీ ఉద్యోగులతో కలిసి కట్ చేసి పంచారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్‌వీవీ రమేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కాండూరి శ్రీనివాసరావు, జెడ్పీ కార్యాలయపు పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడ్డారు.. ఎస్సై పోస్టు కొట్టారు

- కాకినాడ జిల్లా నుంచి ఇద్దరు..
- కోనసీమ నుంచి ముగ్గురు



శ్రీధర్ బాబు



తిరుమాని లోకేశ్వరి



రామాడి కవిత



తల్లిదండ్రులతో కుంచే శ్రీలత



సూర్య ప్రకాష్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెద్దాపురం/ప్రత్తిపాడు రూరల్/కాట్రేనికోన/ఉప్పలగుప్తం : ఖాకీ డ్రెస్ అంటే ఓ గౌరవం. అది ధరిస్తే ఒక హుందాతనం. ఎంతో మంది యువత దీనిని సాధించడం. బుధవారం రాత్రి విడుదలైన ఎస్సై పరీక్ష ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం సత్తిరెడ్డిపేటకు చెందిన కొరిపూరి సూర్యప్రకాష్, ప్రత్తిపాడు రూరల్ మండలం ధర్మవరానికి చెందిన రెడ్డిపల్లి శ్రీధర్ బాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామానికి చెందిన తిరుమాని లోకేశ్వరి, రామాడి కవిత, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన కుంచే శ్రీలత ఈ ఘనత సాధించారు. సూర్యప్రకాష్ 2018లో ఇంజినీరింగ్ పూర్తి చేసినా ఎస్సై ఉద్యోగంపై ఇష్టంతో కష్టపడి ఈ ఘనత సాధించాడు. అతని తండ్రి శ్రీను గోకవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్ కాగా, తల్లి సత్యవతి గృహిణి. అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించిన ఎస్ఐ పరీక్షల్లో 250 మార్కులు సాధించి జోన్ 2 నుంచి ఎస్ఐగా ఎంపికయ్యాడు. అలాగే శ్రీధర్ బాబు వ్యవసాయ నేపథ్యం కలిగిన రెడ్డిపల్లి సత్యనారాయణ, రాఘవమ్మ దంపతుల కుమారుడు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన ఆయన తొలుత 2013లో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించి అమలాపురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన ఎస్సై పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యారు. ఇక లోకేశ్వరి తిరుమాని సత్యానందం కుమార్తె. 7వ తరగతి వరకు ఎంపీపీ యూపీ బలుసుతిప్ప, 8 నుంచి పదో తరగతి వరకు కందికుప్ప హైస్కూళ్లలో చదువుకుంది. తన కుటుంబ ఆర్థిక స్థోమత బాగులేకపోవడంతో మేనత్త కాలాడి వీరవేణి ఇంటి వద్ద కాకినాడలో గాయత్రి జూనియర్ కాలేజీలో ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదివింది. కాకినాడ శ్యామ్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొంది మొదటి బ్యాచ్ లోనే ఎస్సైగా ఎంపికైంది. ఈ విజయం తన అత్తమ్మకే అంకితమని ఆమె గర్వంగా చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన కవిత రామాడి కోటేశ్వరరావు, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె. తండ్రి కోటేశ్వరరావు 1996 తుఫానులో మృతి చెందగా పిల్లతో పాటు తల్లి కాకినాడ వెళ్లిపోయారు. కవిత భర్త కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆమె పదో తరగతి వరకు సెయింట్ అన్స్ స్కూల్, ఇంటర్ నారాయణ జూనియర్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. అలాగే శ్రీలత ఎస్.కొత్తపల్లి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, చిన్ని దంపతుల కుమార్తె. ఆమె స్థానిక సచివాలయం–2 పరిధిలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరందరి విజయాలపై ఆయా గ్రామాల్లో అభినందనలు వెల్లువెత్తాయి.

నిరాడంబరంగానే నూతన సంవత్సర వేడుకలు



మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: తాను ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా నిరాడంబరంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోనున్నట్టు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 2న తన నివాసంలో ప్రత్యేకత ఉంటుందని పలు మీడియా మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. తాను 1978లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి నూతన సంవత్సర వేడుకలను ప్రజలతో కలిసి జరుపుకుంటున్నట్టు చెప్పారు. కాగా గత నాలుగు సంవత్సరాల నుంచి కరోనా, వ్యక్తిగత కుటుంబ కారణాల నేపథ్యంలో న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. 2024 నూతన సంవత్సర వేడుకలను స్నేహితులు, అభిమానుల నడుమ నిరాడంబరంగా జరుపుకుంటామన్నారు.

గ్రాండ్‌గా స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్



రూ.లక్ష నగదు బహుమతి అందుకున్న ఐఐటీ ఖరగ్‌పూర్ ఐటీ వర్స్ ఆన్ లోకల్ టీమ్

- ఆలోచింపచేసిన ఆవిష్కరణలు
- విజ్ఞానదాయక ప్రదర్శనలకు బహుమతులు అందజేత

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ 2023 గ్రాండ్ ఫినాలే బుధవారం రాత్రితో విజయవంతంగా ముగిసినట్టు కళాశాలల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 27 జట్లు నూతన ఆలోచనలతో రూపొందించిన ఆవిష్కరణలు విజ్ఞానదాయకంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మంగళవారం ప్రారంభమై 36 గంటల పాటు నిర్విరామంగా జరిగిందని, మంత్రిత్వశాఖ, ఏఐసీటీఈ నిర్వహించిన ఈ దేశ వ్యాప్త కార్యక్రమం యువ ఇంజినీర్ల విజ్ఞానదాయక ఆలోచనలకు, ఆవిష్కరణలకు వేదికగా నిలిచిందన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐఐటి ఖరగ్‌పూర్ ఐటి వర్స్ ఆన్ లోకల్ టీమ్‌కు లక్ష, తెలంగాణకు చెందిన నైల్ గోగ్డే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ టీమ్‌కు లక్ష, హర్యానా ద్రోణాచార్య ఇంజినీరింగ్ కాలేజ్, బన్సీలాల్ రాంనాథ్ అగర్వాల్ చారిటబుల్ ట్రస్ట్ విశ్వకర్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూణే కళాశాలలకు చెందిన జట్లకు సంయుక్తంగా రూ.50 వేలు చొప్పున, అలాగే మరో అంశంపై చేసిన ఆవిష్కరణలకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లక్నో టీమ్ బన్సీలాల్ రాంనాథ్ అగర్వాల్ చారిటబుల్ ట్రస్ట్ విశ్వకర్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూణే కళాశాలలకు చెందిన టీమ్‌లు సంయుక్త విజేతలుగా రూ.50 చొప్పున నగదు బహుమతులు పొందినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీఈ ప్రతినిధులు యుక్తి అంకుర సంస్థ వ్యవస్థాపకుడు ప్రణవ్ దీక్షిత్, ఐ4సి కంపెనీ మేనేజర్ సౌరభ్ ఉబాలే, డీన్‌లు ఎస్.రమాశ్రీ, జేడీ వెంకటేష్, కో ఆర్డినేటర్ ఎ.లక్ష్మణరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.